

# మ్యూజికల్ మ్యూజింగ్స్

- కస్తూరి మురళీకృష్ణ

ఏ దివిలో విరిసిన పారిజాతమో!

ఏ కవిలో మెరిసిన ప్రేమగీతమో!

నా మదిలో నీవై నిండిపోయెలే!

తెలుగు సినిమా పాటలలో ప్రేయసిని వర్ణిస్తూ ఎన్నో పాటలున్నాయి. కానీ, ఈ పాట మిగతా పాటలన్నిటికన్నా ఓ మెట్టు పైనుంటుంది. ఈ గేయం పూర్తిగా కవితాత్వకమైనదే కాక, తొలి ప్రేమలోని మౌగ్ధ్యం, గాఢత తీవ్రత, స్నిగ్ధత్వం వంటివన్నీ మూటకట్టుకుని జలజలా ప్రవహించే స్వచ్ఛమైన నీటి ప్రవాహంలా ఎదలోతుల్లోని రొమాంటిక్ భావనలను జాగృతం చేయగల శక్తి కలిగి ఉండటం ఈ పాటను పాడిన బాల సుబ్రహ్మణ్యం స్వరంలోని లేతదనం, అత్యంత సరళంగా, తరళంగా ఉన్న బాణీ ఈ పాటను మరపుకురాని రొమాంటిక్ పాటగా నిలుపుతాయి.

దాశరధి ప్రధానంగా కవి. ప్రాచీన ప్రబంధాలను, వాటిలోని ఉత్తమ భావనలను, వర్ణనలను, భాషను, పదాలను జీర్ణించుకున్న కవి. తన కవితలలో ఉత్తమ భావాలను అత్యుత్తమ రీతిలో ప్రదర్శించి, సామాన్యులు సైతం ప్రబంధ స్థాయి భావాలను అనుభవించే రీతిలో కవితను, గేయాన్ని సృజించిన ప్రతిభాశాలి. సినిమా పాటలోనూ అత్యుత్తమ సాహిత్య ప్రదర్శన చేశారాయన. ఆరంభంలో 'ఏ దివిలో విరిసిన పారిజాతమో' అనటంలోనే ఆయన చమత్కారం స్పష్టమవుతుంది.

'పారిజాతం' అంతరిక్షానికీ, భూమికీ నడుమ ఉన్న స్వర్గలోకంలోని నందన వనంలోని వృక్షం. ఇంద్రుడి భార్య ఇంద్రాణికి అత్యంత ప్రీతిపాత్రమైన ఈ పుష్పవృక్షాన్ని మేరు పర్వతం మీద నుంచి తెచ్చి స్వర్గంలో నాటుతారు. మరో పురాణ కథ ప్రకారం సాగర మధనం ద్వారా అందినది పారిజాత వృక్షం. ఈ పారిజాతాన్ని సర్వసృష్టికి ప్రతీకగా కూడా వాడతారు. ఈ వృక్షాన్ని సత్యభామ కోరిక మేరకు నందనవనం నుంచి శ్రీకృష్ణుడు పీకి తెస్తాడు. అంత విలువైనది పారిజాతం. అంతటి అత్యంత విలువైన, అపూర్వమైన, అమూల్యము, సామాన్యులకు గగనకుసుమం అయిన 'పారిజాతం'తో నాయికను పోల్చటమే కాక 'ఏ దివిలో విరిసిన పుష్పం ఈమె' అని ఆశ్చర్యపోతున్నాడు నాయకుడు. 'పారిజాత పుష్పం' దివిలోనే విరుస్తుంది. కానీ ఈమె భూమిమీద నడుస్తోంది. కాబట్టి 'ఎక్కడిదీ భువిపై పారిజాత పుష్పం' అని ఆశ్చర్యపడిపోతున్నాడు నాయకుడు. అంటే, మాములు పారిజాతం కన్నా విలువైన అపురూపమైన 'పారిజాత పుష్పం' అన్నమాట నాయిక.

'ఏ కవిలో మెరిసిన ప్రేమగీతమో ' అన్న భావన అత్యంత సున్నితమైనది. ఇక్కడ నాయకుడు, నాయికను చూసి 'ఏ కవిలో మెరసిన ప్రేమ గీతమో ' అనటంలోని చమత్కారానికి కాస్త వివరణ అవసరం. సాధారణంగా ఒక వ్యక్తి మరో వ్యక్తికి నచ్చటం అంటే ఆ వ్యక్తిలోని ఊహకు దగ్గరగా ఎదుటి వ్యక్తి ఉన్నాడని అర్ధం. అందుకే ఒక వ్యక్తిని మరో వ్యక్తి ప్రేమించటం అన్నది భ్రమ. 'ప్రతివ్యక్తి తనని తానే ప్రేమించుకుంటాడు, తనలోని ఊహను ప్రేమించుకుంటాడు' అంటారు. కాబట్టి, ఒక వ్యక్తిని మరో వ్యక్తి ఇష్టపడటం అంటే ఆ వ్యక్తి ఈ వ్యక్తి మనస్సులో ఉన్న ఊహలకు, కోరికలకు దర్పణం పట్టేట్టు ఉండటమే. ఇతనిలోని ఏదో అంశాన్ని అతను సంతృప్తి పరచటమే. కానీ, ఇక్కడ నాయకుడు 'ఏ కవిలో మెరిసిన ప్రేమగీతమో' అంటున్నాడు. ఒక కవి ప్రేమగీతం ఎప్పుడు రాస్తాడు? అతనికి ప్రేరణ కలిగినప్పుడు. అతనికి

ప్రేరణ కలిగించేంత అతిలోక సౌందర్యం అతనికి ఎదురుపడ్డప్పుడు. అంటే అతనిలో నిద్రాణ స్థితిలో ఉన్న సున్నిత భావనలను జాగృతం చేసే వ్యక్తి తటస్థపడ్డప్పుడు. అలాంటి ప్రేరణనిచ్చే వ్యక్తి కవి ఊహకు తగ్గట్టు ఉంటుంది. కానీ కవుల కవిత్వం వ్యక్తులలో నిద్రాణ స్థితిలో ఉన్న అనేక సున్నితమైన భావనలను జాగృతం చేస్తాయి. అంటే తమలో దాగి ఉన్న సౌందర్య భావనను, తమకు ఏ మాత్రం పరిచయంలేని సౌందర్య భావనను కవుల కవిత్వ ప్రేరణతో సామాన్యులు అనుభవిస్తారన్నమాట. మాములు మనుషుల స్థాయిని దాటి ఒక మెట్టు ఎదుగుతారన్నమాట. తద్వారా వారి ఊహలు, మరింత ఉత్తమం అవుతాయి. అలా కవిలో మెరిసిన ప్రేమగీతం లాంటి ఆకారం ధరించి వస్తున్న ప్రేయసి, తన మామూలు ఊహకాదు. ఒక కవికి ప్రేరణ కలిగించి, ప్రేమగీతం రచింపచేసి వస్తున్న అసమానమైన వ్యక్తి. ఆమెని 'కవి ప్రేమగీతం' అని గుర్తించటం ద్వారా సామాన్యుడయిన నాయకుడు కూడా అసామాన్యుడయ్యాడు. అతడి హృదయం ఆమెతో నిండిపోవటం స్వాభావికం. తన కోసం 'దివి నుంచి దిగి వచ్చిందన్న' భావన అంతర్లీనంగా ఉంది.

'దివి నుండీ భువికి దిగి వచ్చె, దిగి వచ్చే పారిజాతమై నీవై' అని ఆత్రేయ 'తేనెమనసులు' సినిమాలో రాసిన దానికీ 'ఏ దివిలో విరిసిన పారిజాతమో' అనటానికి, భావం ఒకటే అయినా అర్థంలో ఎంతో తేడా ఉంది. 'ఆత్రేయ' పాటలో నాయకుడిలో ఆత్మవిశ్వాసం కనిపిస్తుంది. తగ్గట్టుగా నాయిక 'గుడిలోని ప్రతిమ వచ్చింది, వచ్చింది కోటి ప్రభలతో నీవై నీవై' అంటుంది. అది ఒకరిపై ఒకరికి ప్రేమ ఉందన్న భావన వల్ల కలిగే విశ్వాసం. కానీ ఇక్కడ నాయకుడికి ఇంకా నాయికకు తనపై ప్రేమ ఉందో, లేదో తెలియదు. అంతా నాయకుడి ఊహ. పైగా, ప్రేమ స్థిరమయ్యే వరకూ, పురుషుడు స్త్రీకన్నా తనని తక్కువ చేసి, ఆమెను ఎక్కువ చేసి ఊహించుకుంటాడు. ఆత్మన్యూనతకు గురవుతాడు. అలాంటి సందిగ్ధ స్థితిలో ఆమెను 'తన ఊహ' అని అనలేడు. అందుకే 'ఏ కవిలో మెరిసిన ప్రేమ గీతమో, ఏ దివిలో విరిసిన పారిజాతమో' అంటున్నాడు. 'తేనెమనసులు' పాటలో 'ఏ దివి?' అన్న సమస్య లేదు. 'దివినుండి దిగివచ్చే, దిగివచ్చే పారిజాతమే నీవు' అనే ఆత్మవిశ్వాసం నాయకుడిది. ఎందుకంటే ప్రేమ ప్రకటితమయింది. ఆమోదయోగ్యమయింది ఇద్దరికీ.

ఇంత సూక్ష్మంగా ఆలోచించి, గేయ రచయితలు సినిమా సందర్భంలో, పాత్ర వ్యక్తిత్వంలో ఒదిగింపించి మరీ తమ కవిత్వ పటిమను ప్రదర్శించారు. సినిమా పాటకు సాహిత్య గంధం పూస్తూ, సార్వజనీనతను ఆపాదించారు.

పాలబుగ్గలను లేత సిగ్గులు పల్లవించగా రావే
నీలి ముంగురులు పిల్లగాలితో ఆటలాడగా రావే
కాలి అందియలు ఘల్లు ఘల్లుమన రాజహంసలా రావే

అత్యంత సున్నితము, సుకుమారమైన రీతిలో ప్రేయసి వర్ణనను చేస్తున్నాడు. తొలి ప్రేమలోని లాలిత్యము, సౌకుమార్యము పదాల సారళ్యం స్పష్టం చేస్తుంది. 'పాలబుగ్గలను లేత సిగ్గులు' అనటంతోనే ఇది తరుణ వయసు ప్రేమగాథ అని స్పష్టం అవుతుంది.

నిదుర మబ్బులను మెరుపు తీగవై కలలు రేపినది నీవే
బ్రతుకు వీణపై ప్రణయరాగములు ఆలపించినది నీవే
పదము పదములో మధువులూరగా కావ్యకన్యవై రావే

అద్భుతం! మేఘాలలో మెరిసే 'మెరుపు'ను కవి ప్రతీకగా వాడిన తీరు పరమాద్భుతం. 'నిదుర మబ్బులు' అనటంతోటే 'ఎలాంటి చలనం లేని స్థబ్దమైన జీవితం' అన్న భావన కలుగుతుంది. 'నిదుర మబ్బులను మెరుపు తీగవై కలలు రేపటం' ఎంత సుందరమైన ప్రతీక! ఎంత అద్భుతమైన ప్రయోగం! నల్లటి మబ్బులు నిండిన ఆకాశంలో మెరుపుతీగలు క్షణకాలంసేపు మెరుపు తీగల్లా, ఆకాశంలో వెలుగు నింపి అదృశ్యమవటాన్ని గమనించిన వారికి తెలుస్తుంది మెరుపులలో నిబిడీకృతమైన సౌందర్యం! పరమాద్భుతమైన సౌందర్యం అది! నాయికను మెరుపుతీగతో పోల్చటం, అదీ కలలు రేపటం... అత్యంత సున్నితమైన ఊహ! అంటే స్థబ్దమైన జీవితంలో కలలు కలిగించి ఆశలు రగిలించి

చైతన్యవంతం చేసిందన్నమాట అమ్మాయి. ఎలాగయితే మెరుపుతో నల్లటి ఆకాశం కాంతివంతమవుతుందో, అలాగే అతని జీవితం వెలుగు మయం అయిందన్నమాట. అందుకే అతని నిశ్శబ్ధంగా ఉన్న బ్రతుకు వీణ ఆమె ప్రణయ రాగాలతో చైతన్యవంతమయింది. అతని జీవితం వెలుగుమయం అయిందన్నమాట. అందుకే అతని నిశ్శబ్ధంగా ఉన్న బ్రతుకు వీణ ఆమె ప్రణయరాగాలతో చైతన్యవంతమయింది. ఫలితంగా అతడు ఒక కవి హృదయాన్ని అర్ధం చేసుకుని, అనుభవించగలవాడిగా ఎదిగాడు. అందుకే ఆరంభంలో 'ఏ కవిలో మెరిసిన ప్రేమగీతమో' అనగలిగాడు. అతని జీవితంలో మెరిసిన మెరుపు ఆమె. తద్వారా అతడికి ప్రణయరాగాలు తెలిశాయి. అందుకే ఆమెను 'పదము పదములో మధువులూరే కావ్యకన్య'లా రమ్మన్నాడు.

ప్రేరణ పొందిన కవి హృదయం, సృష్టిని సృజించేందుకు సిద్ధంగా ఉన్న బ్రహ్మ మనస్సులాంటిది. బ్రహ్మ మనో సంచలనం సృష్టికి దారితీస్తే, కవి మనస్సులోని స్పందన, ఒక కదలిక, కావ్య నిర్మాణానికి కారణమవుతుంది. భారతీయ సిద్ధాంతం ప్రకారం 'రసం పరబ్రహ్మ స్వరూపం'. కావ్యకన్యగా నాయిక నాయకుడి మనస్సుకు తోచింది. అతడి మనస్సులో కలిగిన సంచలనం అతడిని కవిని చేసింది. ఆమె అతడి ఊహ. అందుకే ఆమె కావ్యకన్య!అందుకే పదము పదములో మధురసమూరటం....లేకపోతే ఆమె కావ్యకన్య కానేలేదు.

ఇంత అత్యద్భుతంగా ప్రేయసిని వర్ణించటం మామూలు కవులకు సాధ్యంకాదు. అత్యంత సున్నితమైన హృదయం, అమేయమైన సృజనాత్మక ప్రతిభ కల కవికే అది సాధ్యం. దాశరధి ఉర్దూ, పార్సీ సాహిత్యంపై మంచి అవగాహన ఉన్నవాడు కావటంతో, అనేకమైన వర్ణనలు ఆ సాహిత్యం ప్రభావంతో సృజించినవై ఉంటాయి. అలాంటి వర్ణనలకు తెలుగుదనం ఆపాదించి సృజించటంతో గేయం వింతసొంపుతో అలరారుతుంది. ఉర్దూ, పార్సీ సాహిత్యంలో 'ప్రేమ' ప్రాధాన్యం వహించటంతో హిందీ సినిమా పాటలలో ప్రేయసిని వర్ణించే పాటలు అత్యుత్తమ స్థాయిలో ఉండి ప్రత్యేకతతో అలరారుతాయి. అత్యంత ఉత్తమము, సంస్కారవంతము అయిన ప్రేమ భావనను ప్రజలలో విస్తరింప చేశాయి.

**చౌధవీక చాంద్‌హో, యా ఆఫ్ తాబ్ హో**
**జో భీ హో తుం ఖుదాకి కసం లాజవాబ్ హో.**

ఇక్కడ నాయికను తిన్నగా చంద్రుడితో, ఆకాశంలోని నక్షత్రంతో పోలుస్తూ, ఆమె నిరుపమానమైనది, అద్వితీయమైనది అని తేల్చేస్తున్నాడు ప్రియుడు.

**జుల్ఫే హై జైసె కాంధోపె బాదల్ ఝుకే హువే**
**ఆంఖే హై జై సె మైకె ప్యాలే భరే హువే**
**మస్తీ హై జిస్‌మె ప్యార్‌కి తుం వో షరాబ్‌హో**

ఆమె భుజంపై వాలిన కురులు, ఆమెపై మేఘాలు వంగినట్టున్నాయట. కురులను నల్లటి మేఘాలతో పోల్చటం సాంప్రదాయం. ఆమె కళ్లు మదిర నిండిన పాత్రల్లా ఉన్నాయట. ఇది కూడా పర్షియన్ కవిత్వ సాంప్రదాయం. వారు మధుపానమత్త చిత్తులు కాబట్టి, వారికి ప్రేయసి కళ్లు మత్తునిచ్చే మధుశాలల్లా తోస్తాయి. వారికిది అత్యుత్తమమైన వర్ణన.

**ఛా రహీథీ తెరి మహెకీహుయి**
**ఝుల్ఫోంకి ఘటా**
**తేరి ఆంఖోనె పిలాదీ తో మై**
**పీతాహి గయా**
**తౌబ తౌబా వో నషాహై కి బతావూ కైసే**

**లుట్ గయే హో ష్ తొ ఫిర్ హోష్ మె అవూ కైసే!**

'ఆప్ కీ పర్ఛాయియా' సినిమాలో రాజామెహదీ అలీఖాన్ రచించగా మదన మోహన్ స్వరపరచిన 'మై నిగాహే తేరే చెహరే సె హటావూ కైసే' అనే అత్యద్భుతమైన రొమాంటిక్ 'గజల్' ఇది. నిజానికి 'గజల్ ' అన్నప్పుడు 'రొమాంటిక్ ' అని చెప్పాల్సిన అవసరం లేదు. 'గజల్ ' అంటేనే ప్రేమగేయం. కానీ ఇటీవలి కాలంలో తెలుగులో 'గజల్' పేరిట దేశభక్తి గేయం, మాతృభక్తి గేయం, ఊరు భక్తి గేయం, నీతులు చెప్పే గేయం వంటివన్నీ చలామణీ అవుతున్నాయి. కాబట్టి, 'ప్రేమ గజల్' అని నొక్కి చెప్పాల్సి వస్తోంది.

ఇక్కడ ప్రేయసి వర్ణనలో పరిమళభరితమైన ఆమె కురులు మేఘంలా అలముకున్నాయట. ఆమె కళ్లు మధువును తాగిస్తుంటే అతను తాగుతూనే ఉన్నాడట. అవి ఎంతగా మత్తు కలిగించాయో ఎలా చెప్పటం? అంటున్నాడు. ఈ మత్తు ఎప్పుడు వదలుతుందో కూడా చెప్పలేదు. అంతగా మత్తు కలిగించాయన్నమాట. కళ్లను 'మత్తునిండినవి'గా, మధుశాలగా, మధువుగా వర్ణించటం పార్సీ సంప్రదాయం ప్రకారం ఉత్తమ వర్ణన. అందుకే నాయకుడు ఆమె కళ్లను మధువు నిండిన పాత్రలతో పోల్చటంలో అనౌచిత్యం లేదు. అయితే, ఆమె కళ్లు ఎలాంటి మత్తు కలిగిస్తాయంటే ప్రేమ మత్తు. అందుకే నాయకుడు ఆమెని 'ప్యార్ కీ షరాబ్' అన్నాడు. దాంతో ఆమె కళ్లల్లో నిండింది 'ప్రేమ మధువు' అయింది. వర్ణన అత్యుత్తమం అయింది.

**ఛెహెరా హై జై సె ఝీల్ మె హస్తా హువా కమల్**
**యా జిందగీ కె సాజ్ పె ఛేడి హుయీ గజల్**
**జాన్-ఏ-బహార్ తుం కిసి షాయర్ క ఖవాబ్ హో**

ఇక్కడ మనకు దాశరథిపై ఉన్న పర్షియన్, ఉర్దూ సాహిత్య ప్రభావం స్పష్టమవుతుంది. 'కిసి షాయర్ క ఖ్వాబ్'. నువ్వు ఏ కవి కల్పనవో 'ఏ కవిలో మెరిసిన ప్రేమగీతమో' 'గజల్' ప్రేమగీతమే. 'జిందగీ కె సాజ్ పై ఛేడి హుయీ గజల్'. జీవిత లయ అనుగుణంగా సృజించిన గజల్, అంటే ప్రేమగీతం. 'బ్రతుకు వీణపై ప్రణయ రాగం' గజల్ ప్రణయ గీతం. అది జీవితంలోని లయ కనుగుణంగా సృజించినది. బ్రతుకు వీణపై ప్రణయ రాగం, బ్రతుకు ఒక వీణ అయితే దానిలోనూ లయ ఉంటుంది. రాగం ఉంటుంది. ఆ వీణపై ఆలాపించిన ప్రణయ రాగం అన్నమాట. 'ఆమె మోము కొలనులోని కమలం' ఆమె జీవిత స్వనం పై సృజించిన ప్రణయ కవనం. ఆమె ఒక మహాకవి కల్పన. అత్యంత సుందరము, ఉన్నతమైన వర్ణన.

**హోటోంపె ఖేల్తీ హై తబస్సుం కి బిజిలియా**
**సజ్దె తుంహారె రాహ్ పె కర్తీ హై కహెకషా**
**దునియా ఎ హుస్న్ ఔర్ ఇష్క్ క తుం హి షబాబ్ హో**

ఆమె పెదవులపై చిరునవ్వు మెరుపులు నృత్యమాడతాయి. నక్షత్రాలు ఆమె ముందు మోకరిల్లుతాయి. ఇస్లామీయులు భగవంతుని ముందు మోకరిల్లటాన్ని 'సజ్దా' అంటారు 'సజ్దా కరో ' అంటే ప్రణామం చేయి అన్న సామాన్యార్ధం స్థిరపడింది. ఇక్కడ నక్షత్రాలు ఆమెకు ప్రణామం చేస్తున్నాయి అనటానికి 'సజ్దా' అన్న పదం వాడటంతో నాయికను భగవంతుడి స్థాయికి ఎదిగించినట్టయింది. అందుకే చివరి పాదంలో ప్రేమ ప్రపంచానికి ఆమే 'దైవం ' అయింది. అందుకే నక్షత్రాలు 'సజ్దా' చేస్తున్నాయి. ఇక్కడ 'షబాబ్' అన్న పదం చాలా చమత్కారంగా వాడాడు కవి షకీల్ బదాయుని. 'షబాబ్' అన్న పదం యవ్వనంలో ఉత్కృష్ట స్థాయిని సూచిస్తుంది. 'prime of youth' అన్నమాట.

ఇక దాన్నిమించినదేదీ లేదు. అందం, ప్రేమల ప్రపంచంలో అత్యున్నతమైనది ఆమెనే అన్నమాట. అంటే రాణి, దైవంలా అర్థం చేసుకోవచ్చు. దీనికి 'సజ్దా' అన్న పదం ఆధారం. ఎందుకంటే సజ్దా అంటే 'తలవంచి మోకరిల్లటం'. ఇది భగవంతుడి ముందు చేస్తారు. రాజు, రాణిలముందు చేస్తారు. అంతే. అందుకే అనేక పర్షియన్ ప్రేమ గాధలలో, నాయకుడు నాయిక ముందు 'సజ్దా' చేస్తూ 'నేను 'కాఫిర్ ' (భగవంతుడిని నమ్మనివాడ)ను అయ్యాను' అనటం పరిపాటి. ఎందుకంటే, అతడు ఆమెను చూడగానే ఆమెనే అతడి దైవం అయిందన్నమాట.

**అందుకే 'బాబీ' సినిమాలోని 'మై షాయర్ తో నహీ' పాటలో ఆనంద్ బక్షీ**

**జబ్ సె తుఝ్ సే మొహబ్బత్ మై కర్‌నే లగా**

**తబ్ సె జైసే ఇబాదత్ మై కరనే లగా**

**మై కాఫిర్ తో నహీ మగర్ ఏ హసీ**

**జబ్ సె దేఖా మై నే తుఝ్ కో ముఝ్ కో బందగీ ఆగయీ**

అంటాడు. ఎప్పటినుంచయితే ఆమెని ప్రేమించటం ఆరంభించాడో, అప్పటినుంచీ అతడికి పూజ (ఇబాదత్) చేయటం వచ్చిందంట. అంటే, అంతకు ముందు అతడికి 'పూజ' తెలిసినా, దాని ప్రాధాన్యం, పూజలో నిజాయితీ ఆ అమ్మాయిని చూసిన తరువాతే అతనిలో జాగృతమయ్యాయి. అయితే తాను కాఫిర్ (దైవాన్ని నమ్మనివాడు) కాదు, కానీ, ఆమెని చూసిన తరువాతనే అతనికి బందగీ (worship) అంటే 'ధ్యానం' అలవాటయిందట. ఇక్కడ పదాల వాడకాన్ని జాగ్రత్తగా గమనించాలి. బందగీ, ఇబాదత్ అన్న పదాలు పైపైన చూస్తే ఒకే అర్థాన్నిస్తాయి. కానీ బందగీ ఇబాదత్‌లో ఉంటుంది కానీ బందగీ కన్నా 'ఇబాదత్' ఉన్నతమైంది. అందుకే ఆమెని ప్రేమించటం ఆరంభించినప్పటినుంచీ అతడు 'ఇబాదత్' ఆరంభించాడు. ఆమెని చూడగానే 'బందగీ' వచ్చేసింది. బందగీ అనేది ధ్యానం. అందుకే ఆమెని చూడగానే అతడికి 'బందగీ ' వచ్చేసింది. ఇక్కడ అతడి ప్రేమ అందంవల్ల. భౌతికమైనది. కానీ ఆమెని ప్రేమించటం ఆరంభించగానే 'ఇబాదత్' వచ్చేసింది. 'ఇబాదత్' అన్నది శరీరంతోనే కాదు మనస్సుతో, ఆత్మతో చేసే పూజ. ప్రేమ దైవం. రూపం భౌతికం. ప్రేమ మానసికం. ఆధ్యాత్మికం. అందుకే ఇస్లాంలో 'బందగీ'కి నిర్ణీత సమయాలుంటాయి. 'ఇబాదత్' 24గంటలు చేయవచ్చు. బందగీ 'భూమి' అయితే, ఇబాదత్ 'ఆకాశం'. అందుకని ఆమెని చూడగానే (భౌతికం) బందగీ వచ్చింది. ప్రేమించగానే (ఆధ్యాత్మికం) 'ఇబాదత్' వచ్చింది.

'బాబీ' సినిమాను పక్కా వ్యాపార చిత్రంగా భావిస్తారు. 'బాబీ ' అనగానే 'డింపుల్ ' బికినీల్లో గుర్తుకు వస్తుంది. కానీ ఆమెను వర్ణిస్తూ, ఆమెను చూడగానే యువకుడి హృదయంలో కలిగిన భావాన్ని వర్ణిస్తూ రచించిన పాటలో మాత్రం 'లేకితనం', 'చిన్నతనం ' లేదు. అత్యద్భుతమైన భావం పొదిగి ఉంది.

ఇక్కడ చమత్కారం ఏమిటంటే, స్పష్టంగా 'ప్రేమ దైవమని ప్రేమ భావనలోని ఆధ్యాత్మకతను ప్రదర్శించే పాట చిత్రీకరణను చూస్తే అసలు అలాంటి భావననే కలగదు. బాణీ లయను అనుసరిస్తూ అరుణా ఇరానీ నడుము ఊపటం తప్ప 'ఇబాదత్', 'బందగీ'ల భావం మనసుకు స్పృశించదు. అదే 'చౌదవీక చాంద్ హో ' పాటలో ఎంతో నర్మగర్భితంగా ప్రేమ ఆభ్వనలోని ఆధ్యాత్మికతను ప్రదర్శించినా, పాట చిత్రీకరణలోని గొప్పతనం పాట భావాన్ని అర్థం చేసుకుని నిజాయితీగా చిత్రీకరించే దర్శకుడి 'మనస్సు' పై ఆధారపడి ఉంటుందని నిరుపిస్తూ. ఈ పాట చూస్తూంటే మనసులోని తీవ్రమైన భావన ఆధ్యాత్మకపు పొలిమేరలను తాకే భావన కలుగుతుంది. దీనికి ప్రధాన కారణం దర్శకుడు.

'బాబీ' సినిమా 'హిట్' సినిమా నిర్మించాలన్న తపనతో నిర్మించిన సినిమా. అందుకే పాట బాణీ తేలికగా పట్టేసే బాణీ. పాడిన గాయకుడు కూడా పదాల భావాన్ని అనుభవించకుండా తేలికగా పాడేశాడు శైలేంద్రసింగ్ అనే కొత్త గాయకుడు. చిత్రీకరణ ఆకర్షణీయంగా ఉంటుంది. అదే 'చౌధవీక చాంద్ హో ' దగ్గరకు వచ్చేసరికి, పహాడి రాగంలోని రొమాన్స్ నంతా గుప్పించి బాణీని రూపొందించాడు రవి. 'పహాడి రాగం శాంతిని, సున్నితత్వాన్ని ప్రతిబింబిస్తుంది. పహాడీ రాగం ప్రేయసిలాంటిదంటారు. కలయికలోని ఆనందం విరహంలోని

గాంభీర్యం కలగలసి అలౌకికానందాన్ని, ఆధ్యాత్మికానుభూతిని కలిగించగల రాగం పహాడీ. 'సుహానీ రాత్ ఢల్ చుకీ నజానె తుం కబ్ ఆవోగీ ' (దులారీ) 'ఇషారో ఇషారోమె దిల్ లేని వాలె (కాశ్మీర్కి కలి), బహారో మేరా జీవన్ భీ సవారో (ఆఖ్రీఖత్), కభీ కభీ మెరె దిల్‌మే (కభీకభీ) వంటి సూపర్ హిట్ రొమాంటిక్ పాటలన్నీ పహాడీరాగం ఆధారంగా సృజించిన గీతాలే. కానీ అదే పహాడీ రాగంలోని సున్నితత్త్వాన్ని, రొమాంటిసిజంలోని ఆధ్యాత్మికతను ప్రస్ఫుటింపచేస్తూ రవి బాణీని రూపొందించాడు. దాంతో మొదటి అడుగులోనే పాట ఉన్నత శిఖరాన్ని అందుకున్నట్టయింది. దానికి షకీల్, పదాలు రఫీ గానం తోడయి పాటకు అమరత్వాన్ని ఆపాదించాయి. పాట స్థాయి మరింత పెరిగి చిరంజీవిగా ఉన్నత స్థానంలో నిలిపింది గురుదత్ చిత్రీకరణ. నిజానికి ఈ సినిమా దర్శకుడు గురుదత్ కాదు. అధికారికంగా. చిత్రదర్శకుడు ఎం.సాదిక్. కానీ చిత్రీకరణ పూర్తిగా గురుదత్ ముద్రతో ఉంటుంది. నిద్రిస్తున్న వహీదానువెన్నెలలో తడిసి శిల్పంగా తల్పంపై ఉన్న ఆమెను ఆర్తిగా, తీవ్రమైన ప్రేమతో చూస్తూ రాగాలాపన చేసి, ఆమెవైపు వస్తూ పాటనందుకున్నప్పుడు గురుదత్ చూపులలోని భావం పాటకు మరింత తీవ్రతను అద్దింది. 'జుల్ఫిహై ' అంటూ ఆమెను అతను చూసే చూపుల్లోని ప్రేమ భావన అద్వితీయం. అతని నటనలో ఎక్కడ లోపం ఉందో, ఆ లోపాన్ని రఫీ స్వరంలో పలికే భావం తీర్చింది. దాంతో ప్రతి పంక్తి, ప్రతి నోట్ ఒక అద్భుతమైన భావనను కలిగించే రీతిలో రూపొందింది. ముఖ్యంగా 'జానే బహార్ తుం కిసి షాయర్ క ఖ్వాబ్ హో' అన్నప్పుడు కెమేరా కదులుతూ చివరికి గురుదత్ ఆమె మ్రోల వాలి చేతులు సాచి ఉండటం, వహీదా స్థంభానికి తన్మయమై ఆనుకుని ఉండటం, ఇరువురి పై ప్రేమామృత వృష్టి కురిపిస్తూ చంద్రుడూ ఇరువురి నడుమ ఆకాశంలో కనబడటం, ఒక ఆత్యద్భుతమైన పెయింటింగ్‌లా మనసులో స్థిరపడిపోతుంది. అలౌకిక భావాలు కలిగిస్తుంది. ఈ పాటను రొమాంటిక్ పాటలన్నిటిలోనే ఎత్తైన శిఖరంపై నిలుపుతుంది. అత్యద్భుతమైన చిత్రీకరణ ఇది.

ఇలాంటి పాటల భావం తెలుసుకుంటూ, అనుభవిస్తూంటే ఇక ప్రేమ భావనలోని అత్యున్నతమైన అంశాలు వ్యక్తి మనసులో స్థిరపడతాయి తప్ప ప్రేమను పశుభావ స్థాయికి దిగజార్చే నైచ్యాన్ని కలిగించవు.

*(వచ్చే నెలలో మరిన్ని ప్రేమ పాటలతో)*

Post your comments